క్లుప్తంగా

25 మంది వాహన చోదకులపై కేసులు



నగరంలో ప్రత్యేక తనిఖీలు చేస్తున్న రవాణా శాఖ అధికారులు

గోపాలపట్నం: సీటు బెల్ట్ పెట్టుకోకుండా కార్లలో ప్రయాణం చేస్తున్న వాహన చోదకులపై రవాణా శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. సుమారు 25 మందిపై కేసులు నమోదు చేశారు. కార్లలో ప్రయాణం చేసేవారు తమ రక్షణ కోసం సీటు బెల్టు పెట్టుకోవాలని అధికారులు సూచించారు. కార్లు నడిపేవారు సీటు బెల్టు పెట్టుకోవడం అలవాటుగా మార్చుకోవాలని చెప్పారు. తనిఖీల్లో ఎంవీఐలు రాజారావు, సుధీర్, మాధవి తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ అదృశ్యం



చావన్ యేసు

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ ఆటో డ్రైవర్ అదృశ్యమైన ఘటన వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. గవర కంచరపాలెం గ్రంథాలయం వీధిలో కుటుంబంతో కలిసి నివసిస్తున్న చావన్ యేసు ఆటో నడుపుతూ జీవిస్తున్నాడు. ఈ నెల 1న ఇంటి నుంచి బయటకు వెళ్లిన అతడు ఇంతవరకూ తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ప్రాంతాల్లో అంతటా వెతికినా ప్రయోజనం లేకపోవడంతో యేసు భార్య రాజేశ్వరి పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ ఎస్.భాస్కరరావు నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ నరసింహమూర్తి బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. యేసు ఆచూకీ తెలిసిన వారు సమాచారం అందించాలని కంచరపాలెం పోలీసులు కోరారు.

స్టీల్‌ప్లాంట్ కార్మికులకు 16న జీతాలు

ఉక్కునగరం: ఒకటి రెండు రోజుల్లో జీతం వస్తుందని ఆశించిన స్టీల్‌ప్లాంట్ కార్మికులకు నిరాశ కలిగించే వార్త ఇది. కార్మికుల జీతాల కోసం మూడు ప్రధాన కార్మిక సంఘాల నాయకులు బుధవారం స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్‌ను కలవగా ఆయన నుంచి వచ్చిన సమాధానమిది. నాయకులు అందించిన సమాచారం మేరకు వివరాలిలా వున్నాయి. కార్మికులకు జీతాలు చెల్లించాలని నాయకులు కోరగా... ఈ నెల 10న జీఎస్టీ రూ.180 కోట్లు చెల్లించాల్సి ఉందని, బొగ్గుతో వస్తున్న రెండు నౌకలకు సంబంధించి పేమెంట్ చేయాలని సీఎండీ భట్ తెలిపారు. ఈ నేపథ్యంలో 16న కార్మికులందరికీ పూర్తి జీతాలు చెల్లిస్తామని చెప్పడంతో నాయకులు వ్యతిరేకించారు. రెండు రోజుల్లో జీతాలు చెల్లించకుంటే కార్మికుల అశాంతికి యాజమాన్యం బాధ్యత వహించాలని చెప్పినట్టు నాయకులు తెలిపారు. అయినప్పటికీ యాజమాన్యం వైఖరి మారనట్టు తెలిసింది. సమావేశంలో కె.ఎస్.ఎన్.రావు, నరేష్‌కుమార్, నీరుకొండ రామచంద్రరావు, యు.రామస్వామి, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

చేనేతకు చేయూతనివ్వండి

అగనంపూడి: చేనేత వస్త్రాలకు ప్రభుత్వాలు చేయూతనిస్తే, కార్మికులు, వృత్తి పనిచేసే వేలాది కుటుంబాలు ప్రశాంతంగా బతుకుతాయని శ్రీపద్మ మార్కండేయ సేవా సంఘం గౌరవాధ్యక్షుడు, దువ్వాడ రైల్వేస్టేషన్ కన్సల్టెన్సీ కమిటీ సభ్యుడు కొలిపాక అప్పారావు అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా అగనంపూడి ఆర్‌హెచ్‌సీ పెదమడకలోని శ్రీపద్మ మార్కండేయ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముందుగా పద్మశాలీల ఆరాధ్య దైవం భావనారుషి పద్మావతి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ ప్రజలు చేనేత వస్త్రాలను ధరించగలిగితే చేనేత వృత్తి వారికి ఊతమిచ్చినవారవుతారన్నారు. ఉక్కు కార్మిక సంఘం నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ మనిషికి చేనేత వస్త్రాలు మరింత అందాన్నిస్తాయన్నారు. అగనంపూడి ప్రాంతీయులకు సేవలందిస్తున్న సేవా సంఘానికి సామాజిక భవనం నిర్మించుకునేందుకు ప్రభుత్వం స్థలం కేటాయించాలన్నారు. నిరుపేద మహిళలకు, వృద్ధులకు చేనేత చీరలు, పంచెలు పంపిణీ చేశారు.



మేమంతా వైఎస్సార్‌సీపీలోనే..

- ప్రజల తరఫున పోరాడుతాం
- వైఎస్సార్‌సీపీ 59వ వార్డు నాయకులు



వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొన్న 59వ వార్డు నాయకులు, కార్యకర్తలు

మల్కాపురం: తామంతా వైఎస్సార్‌సీపీలోనే ఉండి ప్రజా సమస్యలపై పోరాడుతామని వైఎస్సార్‌సీపీ 59వ వార్డు ముఖ్య నాయకులు, కార్యకర్తలు స్పష్టం చేశారు. మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్ సూచనల మేరకు వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు రేవళ్ల సత్యనారాయణ అధ్యక్షతన బుధవారం పార్టీ ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 59వ వార్డు కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీ వైఎస్సార్‌సీపీ నుంచి కార్పొరేటర్‌గా గెలుపొంది నేడు జనసేన పార్టీలోకి వెళ్లినంత మాత్రాన పార్టీకి వచ్చిన నష్టం ఏమీ లేదన్నారు. పార్టీ క్యాడర్ అంతా ఒకే తాటిపై ఉన్నామని చెప్పారు. తిరిగి వైఎస్సార్‌సీపీ ని అధికారంలోకి తీసుకువచ్చేంత వరకు శ్రమిస్తామని, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రజాసమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు పెంటారావు, సన్యాసిరావు, పెద్దిరాజు, సంపత్, భూపతి రాజు, ఖాన్, ఎదురు సత్య నారాయణ, అప్పలరాజు, శేఖర్, కార్యకర్త లు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

మర్రిపాలెం: జోన్–2 ఎన్‌ఎస్‌టీఎల్ సెక్షన్ పరిధిలో 11 కేవీ ఎయిర్‌పోర్ట్ ఫీడర్ నిర్వహణ పనుల్లో భాగంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బి.కె.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు అంబేడ్కర్ నగర్, సాయినగర్, జాకీర్‌హుస్సేన్ నగర్, పార్వతీనగర్ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలు గమనించాలని ఆయన కోరారు.

శ్రీహరిపురం, ములగాడ ఫీడర్లలో..

మల్కాపురం: శ్రీహరిపురం సబ్‌స్టేషన్ పరిధి ములగాడ 11 కేవీ ఫీడర్‌లో వార్షిక మరమ్మతుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పాడుతుందని జోన్–2 ఈఈ బి.కె.నాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు ములగాడ ఫీడర్ పరిధిలోని ములగాడ హౌసింగ్ కాలనీ, కొత్త నక్కవానిపాలెం, పాత చెక్‌పోస్ట్ ఏరియా, గాజువాక ఆర్టీసీ డిపో ఏరియా, ఎక్స్ సరివ్వీస్‌మెన్ కాలనీ, హనుమాన్‌నగర్, గణపతినగర్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫదా ఉండదన్నారు. శ్రీహరిపురం ఫీడర్ పరిధిలోని మార్కెట్ ఏరియా, శ్రీహరిపురం మెయిన్ రోడ్డు ఏరియా, పాత్రుడు కాలనీ, ఓల్డ్ రామాలయం ఏరియా, వీటీ కాలేజ్ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

కంచరపాలెం పరిధిలో..

కంచరపాలెం: కంచరపాలెం సెక్షన్ పరిధిలోని 11 కేవీ కంచరపాలెం ఫీడర్ లో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. గవర కంచరపాలెం, దుర్గానగర్, గౌరీనగర్, రెడ్డికంచరపాలెం, సుభాష్‌నగర్, గోకుల్‌నగర్, గొల్లకంచరపాలెం, మళ్లసూరివీధి, వివేకానందవీధి, జాషువానగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని కోరారు.

శిథిలావస్థలో జీవీఎంసీ పాఠశాల



శ్లాబ్ పెచ్చులు ఊడిపడుతున్న మల్కాపురం జీవీఎంసీ హైస్కూల్

మల్కాపురం: స్థానిక జీవీఎంసీ హైస్కూల్ భవనం శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. 61వ వార్డు మల్కాపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాల పాత భవనానికి ఎదురుగా ఐదేళ్ల కిందట అధికారులు కొత్త భవనం నిర్మించారు. ఈ అదనపు భవనంలో వివిధ తరగతులు బోధిస్తున్నారు. ప్రస్తుతం ఈ భవనం సన్‌షేడ్ శ్లాబ్ పెచ్చులు వారం రోజులుగా ఊడిపడుతున్నాయి. తరగతి గదుల్లో గోడలు బీటలు వారాయి. ఈ అదనపు భవనం ఎదురుగా ఉన్న మైదానంలో విద్యార్థులు స్కూల్ ప్రేయర్, వివిధ ఆటలు ఆడుతుంటారు. ఆడుకునే సమయంలో ఎక్కడ తమపై శ్లాబ్ పెచ్చులు ఊడిపడతాయోనని విద్యార్థులు భయపడుతున్నారు. ఈ సమస్యపై అధికారులు స్పందించి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

విద్యార్థులు ఇష్టంగా తినేలా 'మధ్యాహ్న భోజనం'



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజనం నాణ్యత ప్రమాణాలతో విద్యార్థులు ఇష్టంగా తినేలా ఉండాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ఆదేశించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం పథకం అమలుపై విద్యా శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి స్టీరింగ్, పర్యవేక్షణ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం పథకం అమలులో రైస్ మినహా, మిగిలిన మెనూ అంతా బాగుందని తెలిపారు. బియ్యం బాగాలేకపోతే వాటిని తిప్పి పంపాలని కలెక్టర్ సూచించారు. మధ్యాహ్న భోజనం కోసమే బడికి వచ్చే విద్యార్థులు చాలా మంది ఉన్నారని, ఇటువంటి పరిస్థితిలో పిల్లలు ఇష్టపడి తినేలా పదార్థాలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజన సంక్షేమ పాఠశాలల్లో ఈ పథకాన్ని మరింత పటిష్టంగా అమలు చేయాలని ఆదేశించారు. ప్రతి ఎంపీడీవో తమ పరిధిలోని పాఠశాలలను సందర్శించి, మధ్యాహ్న భోజన పథకం అమలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరుతో పాటు పారిశుధ్యం పనులు పరిశీలించాలని జెడ్పీ సీఈవోకు సూచించారు. వారంలో రెండు పాఠశాలలు సందర్శించాలని కలెక్టర్ ఆదేశించారు. యూపీహెచ్‌సీ, పీహెచ్‌సీ పరిధిలోని వైద్యాధికారులు పాఠశాలలను సందర్శించి విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థుల వివరాలను ఆర్‌బీఎస్ నోడల్ అధికారికి తెలియజేయాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. డీఈవో ఎల్.చంద్రకళ మాట్లాడుతూ జిల్లాలో 584 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయన్నారు. వీటిలో 61,228 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజన పథకాన్ని తీసుకుంటున్నట్లు ఆమె వివరించారు. ఈ సమావేశంలో డీఎం హెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు, డీఎస్‌వో సూర్యప్రకాశరావు, సమగ్ర శిక్ష ఏపీసీ శ్రీనివాస్, డీఆర్‌డీఏ పీడీ ఎం.శోభారాణి, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

'టచ్'లపై అవగాహన అవసరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ ఎర్రం నాయుడు

అగనంపూడి: గుడ్, బ్యాడ్ టచ్‌లపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని, ఈ రోజుల్లో ఏ వయసు వారినీ, బంధువులనూ నమ్మడానికి వీలు లేదని దువ్వాడ ఇన్‌స్పెక్టర్ వావిలపల్లి ఎర్రం నాయుడు సూచించారు. కూర్మన్నపాలెంలోని రామకృష్ణ పాఠశాలలో విద్యార్థులకు వివిధ చట్టాలు, నేరాలు, వాటి ప్రభావం, టచ్‌లపై అవగాహన కల్పించారు. పాఠశాల స్థాయిలోనే కొంత మంది విద్యార్థులు మత్తు మందులకు అలవాటు పడుతున్నారని, జీవితాన్ని మలుపు తిప్పే ఈ వయసులో చక్కగా చదువుకోవాలని సూచించారు. గంజాయి, హెరాయిన్, మద్యం, సిగరెట్ వంటి వ్యసనాలను దరిచేరనీయ వద్దన్నారు. పోక్సో చట్టం, గుడ్, బ్యాడ్ టచ్‌ల గురించి వివరించారు. వయసుతో సంబంధం లేకుండా బంధువులు అయినా సరే దురుద్దేశంతో టచ్ చేస్తే క్షమించరాదన్నారు. టీనేజ్ తుఫాన్ లాంటిదని, సముద్రంలో వచ్చే వాయుగుండం లాంటిదన్నారు. ఈ వయసులో మనసు కట్టడి చేసుకుని ఉన్నతంగా ఆలోచిస్తే ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందన్నారు. అనంతరం ట్రాఫిక్ నిబంధనలు, లైసెన్స్ లేకుండా వాహనాలు నడపితే కలిగే కష్టాలు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పొన్నాడ వాసుదేవరావు, డైరెక్టర్ లలిత, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేజీహెచ్ ఏవోగా మంగరాజు

మహారాణిపేట: కేజీహెచ్ ఏవోగా ఎస్.మంగరాజు నియమితులయ్యారు. బుధవారం సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్‌ను కలిసి బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు నగరంలో ప్రభుత్వ మానసిక వైద్యశాలలో ఆఫీసు సూపరింటెండెంట్‌గా, గతంలో కేజీహెచ్ సీనియర్ అసిస్టెంట్‌గా మంగరాజు విధులు నిర్వర్తించారు. ఆయన పదోన్నతిపై కేజీహెచ్ ఏవోగా నియమితులయ్యారు. ఆయనను కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్, మేనేజర్ సీఎం జవహర్ లాల్, సీనియర్ అసిస్టెంట్లు బాలకృష్ణ, నూకరాజు, ప్రకాష్, శ్రీనివాస్, ప్రసాద్ అభినందించారు.

పశు గణనకు అధికారులు సిద్ధంగా ఉండాలి



పశు గణన పోస్టర్ ఆవిష్కరిస్తున్న పశు సంవర్థక శాఖ జేడీ డాక్టర్ రామకృష్ణ, అధికారులు



పశు గణన శిక్షణలో ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు

ఆరిలోవ: పశు గణన కోసం పశు సంవర్థక శాఖ అధికారులు, సిబ్బంది సిద్ధంగా ఉండాలని ఆ శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రామకృష్ణ తెలిపారు. పశు గణనకు సంబంధించిన శిక్షణ కార్యక్రమం డెయిరీ ఫారం వద్ద జిల్లా పశు సంవర్ధక శాఖ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించారు. ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు శిక్షణ ఇచ్చారు. జిల్లా నోడల్ అధికారి మాదిన ప్రసాదరావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రతి ఇంటిలోను పశువులు, కోళ్లు, తదితర వాటిని ఎలా నమోదు చేయాలో వివరించారు. ఈ సందర్భంగా ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్లు, అసిస్టెంట్ డైరెక్టర్లతో కలసి జేడీ డాక్టర్ రామకృష్ణ పశు గణనకు సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 21వ అఖిల భారత పశు గణన ఈ ఏడాది సెప్టెంబర్ 1 నుంచి ప్రారంభంకానుందన్నారు. పశు గణనకు జిల్లాలో 130 మంది ఎన్యుమరేటర్లు, 25 మంది సూపర్‌వైజర్లను నియమించినట్లు తెలిపారు. వారికి పూర్తి స్థాయి శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. సిబ్బంది నిబద్ధతతో గణన చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉప సంచాలకులు డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ రామ్మోహన్, సహాయ సంచాలకులు డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ రవికుమార్, డాక్టర్ వెంకటరమణ, తదిరుతరులు పాల్గొన్నారు.

ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలి

జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

దాబాగార్డెన్స్ : ప్రజలకు అందించే తాగునీరు కలుషితం కాకుండా, నిత్యం నీటి తనిఖీలు నిర్వహించాలని జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ మంచినీటి విభాగం ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. టౌన్‌సర్వీస్ రిజర్వాయర్(టీఎస్ఆర్)ను బుధవారం సందర్శించి జలాశయాల నుంచి నగర ప్రజలకు సరఫరా చేస్తున్న తాగు నీటి సరఫరా ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీరు కలుషితం కాకుండా, సురక్షిత తాగునీటిని అందించాలని, ఆ దిశగా అధికారులు, ఉద్యోగులు విధులు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని జీవీఎంసీ పర్యవేక్షక ఇంజినీర్ కేవీఎన్ రవిని ఆదేశించారు. నగరానికి ఎన్ని జలాశయాల నుంచి నీటి సరఫరా జరుగుతుంది? ఎన్ని రిజర్వాయర్లు ఈఎల్‌ఎస్‌ఆర్, జీఎల్‌ఎస్ఆర్ ట్యాంకులున్నాయని ఆరా తీశారు. నగరంలో ఏడు జలాశయాల నుంచి నగరానికి నిత్యం 388 ఎంఎల్‌డీ నీటిని శుద్ధి ప్లాంట్ల ద్వారా నీటి సరఫరా అవుతుందని, 48 మినీ రిజర్వాయర్లు, 100 ఈఎల్‌ఎస్‌ఆర్, 146 జీఎల్‌ఎస్ఆర్ ట్యాంకులు ఉన్నాయని, వీటి ద్వారా నాణ్యమైన నీటిని నిత్యం ప్రజలకు అందించడం జరుగుతుందని అధికారులు తెలిపారు. అంతేకాక సచివాలయాల పరిధిలో 2500 నీటి నాణ్యత పరీక్షలు నిత్యం జరుపుతూ ప్రజలకు ఉదయం 4.30 నుంచి రాత్రి 9.30 గంటల వరకు ప్రాంతాల వారీగా రోజూ 45 నిమిషాల నుంచి ఒక గంట సమయం పాటు స్వచ్ఛమైన నీటిని అందిస్తున్నట్లు వివరించారు. వంద రోజుల ప్రణాళిక, స్టాప్ డయేరియా కార్యక్రమాల్లో భాగంగా ప్రజలకు మంచినీటిని అందించాలని, కాల్వలు, కల్వర్టుల్లో ఉన్న తాగు నీటి పైపులైన్ లీకులను అరికట్టి, వాటి వద్ద నీరు కలుషితం కాకుండా మార్పు చేసి త్వరితగతిన అమర్చాలని అధికారులను ఆదేశించారు. అనంతరం టీఎస్‌ఆర్‌లో గల పంప్‌హౌస్‌ను పరిశీలించి విద్యుత్ వినియోగం తగ్గించేలా చర్యలు చేపట్టాలని పర్యవేక్షక ఇంజనీరు కేవీఎన్ రవిని కమిషనర్ ఆదేశించారు. ఈ పర్యటనలో కార్యనిర్వాహక ఇంజనీరు శేఖర్, ఉపకార్య నిర్వహాక ఇంజనీరు సతీష్, సహాయక ఇంజనీరు స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



అగనంపూడిలో పట్టుకున్న పీడీఎస్ రైస్

మహారాణిపేట: నగరంలోని వేర్వేరు ప్రాంతాల్లో ప్రజా పంపిణీ వ్యవస్థ(పీడీఎస్)కు చెందిన బియ్యాన్ని బుధవారం పౌర సరఫరాల శాఖాధికారులు పట్టివేశారు. డీఎస్‌వో సూర్యప్రకాశరావు ఆధ్వర్యంలో చెక్కింగ్ ఇన్‌స్పెక్టర్లు తనిఖీలు చేపట్టారు. డాబా గార్డెన్‌లో అనధికారికంగా ఓ వాహనంలో రవాణా చేస్తున్న పీడీఎస్ రైస్‌ను స్వాధీనం చేసుకుని 6ఏ కేసు నమోదు చేశారు. అగనంపూడి, పెదమాదక ప్రాంతాల్లో నిల్వ ఉంచిన 400 కిలోల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అలాగే తగరపువలసలో అక్రమంగా నిల్వ ఉంచిన 300 కిలోల పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసుకుని 6ఏ కేసు నమోదు చేశారు. ఇప్పటివరకు మొత్తం 4,700 కిలోల బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్‌వో సూర్యప్రకాశరావు తెలిపారు. రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనాలను కూడా సీజ్ చేశామన్నారు.

తల్లిపాలతో బిడ్డకు ఆరోగ్యం



అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు



కార్యక్రమంలో పాల్గొన్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వరలక్ష్మి తదితరులు

మర్రిపాలెం: తల్లిపాలతో పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని, వారిలో వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పీడీ జయదేవి అన్నారు. ఆర్ అండ్ బీ జంక్షన్ వద్ద ఉన్న ఐసీడీఎస్ కార్యాలయంలో బుధవారం అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు మొదటి గంటలో తల్లిపాలు ఎంతో ముఖ్యమన్నారు. ఆరు నెలల వరకు బిడ్డకు తప్పనిసరిగా తల్లిపాలు అందించాలన్నారు. రేపటితరం చిన్నారులు ఆరోగ్యంగా ఉండాలంటే తల్లి పాలు ఎంతో అవసరమని చెప్పారు. అంగన్‌వాడీలతో ప్రతిజ్ఞ చేయించి, అనంతరం పరిసర ప్రాంతాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీవో శ్రీలత కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. శివనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఏంజెలీనా, ఐసీడీఎస్ సెక్టార్ సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

మల్కాపురం: పిల్లలకు తల్లి పాలే శ్రేయస్కరం అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వరలక్ష్మి అన్నారు. తల్లి పాలు వారోత్సవాల సందర్భంగా మిషన్ శక్తి ఆధ్వర్యంలో 58వ వార్డు శ్రీహరిపురంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఒత్తిడికి గురికాకుడదని.. ప్రతి నెలా వైద్యుల సూచనల మేరకు జాగ్రత్తలు పాటించాలన్నారు. బిడ్డ జన్మించిన వెంటనే తల్లి పాలే ఇవ్వాలన్నారు.పాలు ఇవ్వడం వల్ల తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ బి.సంధ్యారాణి, వై.ఇంద్రమ్మ, నజ్మా తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు



చిత్రలేఖన పోటీలను పర్యవేక్షిస్తున్న సంస్థ సభ్యులు

కంచరపాలెం: రామ్మూర్తిపంతులుపేట జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో ఎస్ఏఎల్‌పీజీ, ఎన్‌జీవో–యునైటెడ్ వే ముంబై సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం యునైటెడ్ ఫర్ రోడ్ సేఫ్టీ ప్రోగాం నిర్వహించారు. సంస్థ ఇన్‌చార్జి సంతోష్ పర్యవేక్షణలో 6, 7, 8 తరగతుల విద్యార్థులకు రోడ్డు భద్రతపై చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. సంస్థ సభ్యులు విద్యార్థులకు డ్రాయింగ్ కిట్లు పంపిణీ చేశారు. ఉత్తమ చిత్రాలను గీసిన విద్యార్థులను ఎంపిక చేశారు. విశాఖ పోలీస్ కమిషనర్ సమక్షంలో ఫైనల్ పోటీలు జరుగుతాయని సంతోష్ తెలిపారు. అనంతరం పాఠశాల హెచ్ఎం ఆర్ శ్రీనివాస్‌రావు, చిత్రలేఖన ఉపాధ్యాయుడు ఎస్.సాయిశంకర్ చేతుల మీదుగా విద్యార్థులకు ప్రశంస పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు సిహెచ్.కిషోర్, కె.సూర్యతేజ, కామేశ్వరరావు, మనోహరి, పాఠశాల పీడీఈ ఆర్.బాలరాజు, వర్క్ ఎడ్యుకేషన్ టీచర్ సూరిశెట్టి రేణుకాదేవి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

గెడ్డలు దుర్గంధభరితం



గొల్లకంచరపాలెంలో పూడికతో నిండిన గెడ్డ

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు గొల్లకంచరపాలెం నుంచి తోటవీధి, దుర్గానగర్, గోకల్‌నగర్, గౌరీనగర్ ప్రాంతాల్లో రైల్వే ట్రాక్‌కు ఆనుకుని ఉన్న గెడ్డలు చెత్తతో నిండిపోయి కంపుకొడుతున్నాయి. గెడ్డల్లో పూడికలు సక్రమంగా తీయకపోవడంతో పరిసర ప్రాంతాలు దుర్గంధభరితంగా మారుతున్నాయి. వర్షాలు పడేటప్పుడు గెడ్డల్లో చెత్తాచెదారం అడ్డంగా నిలవడంతో పందులు చేరుతున్నాయి. పూడికలు తొలగించాలని పారిశుధ్య సిబ్బందికి ఫిర్యాదులు చేసినా.. పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రోడ్లపై ఊడ్చిన చెత్తను గెడ్డల్లోనే వేస్తున్నారు. దోమలు వృద్ధి చెంది రోగాలు ప్రబలుతాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి గెడ్డల్లో పూడికలు తొలగించి శుభ్రం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తే చూస్తూ ఊరుకోం

మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

అగనంపూడి: నిర్వాసితుల త్యాగానికి ప్రతిఫలంగా నిలిచిన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరిస్తే రాష్ట్ర ప్రజలు చూస్తూ ఊరుకోరని మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి హెచ్చరించారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో నిర్వహిస్తున్న రిలే దీక్షా శిబిరంలో బుధవారం ఆయన పాల్గొని సంఘీభావం తెలిపారు. 1273వ రోజు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నిర్వాసితులు నామమాత్రపు ధరకు 23 వేల ఎకరాల స్థలం ధారాదత్తం చేశారని, ప్రస్తుతం ఆ భూములపైనే బడాబాబులు కన్నేశారని ఆరోపించారు. ఆ భూములతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలనుకుంటున్న వారికి కట్టబెట్టేందుకు కేంద్ర ప్రభుత్వ పెద్దలు చూస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్య పక్షాలైన టీడీపీ, జనసేన అధినేతలు చొరవ తీసుకుని ప్రైవేటీకరణను అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. కర్మాగారానికి తక్షణ సాయంగా రూ.5 వేల కోట్లు అందివ్వాలని, సొంతగా ఘనులు కేటాయించాలని, ఆర్ఐఎన్ఎల్‌లో విలీనం చేయాలని కోరారు. తెలుగు రాష్ట్రాల ఇంటక్ ఉపాధ్యక్షుడు జెర్రిపోతుల ముత్యాలు మాట్లాడుతూ వేలాది మంది నిర్వాసితులు, ఉక్కు ఉద్యోగుల ఉపాధికి గండి కొట్టాలని కేంద్రం చూస్తోందని, ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మంది జీవనం సాగిస్తున్న విశాఖ ఉక్కును ప్రైవేటీకరించాలని చూడడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బొడ్డ గోవింద్, నాయకులు ఎన్నేటి రమణ, చిత్రాడ రమణ, ఆదారి శ్రీను, పల్లా చినతల్లి, కర్రి దాలినాయుడు, కంద్రేగుల శ్రీనివాసరావు, పల్లా పెంటారావు పాల్గొన్నారు.

కొనసాగుతున్న శ్రావణలక్ష్మి పూజలు

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా నిర్వహిస్తున్న శ్రీలక్ష్మీ పూజలు బుధవారం మూడో రోజుకు చేరాయి. ఉదయం 8 గంటలకు వేదమంత్రాలు, నాదస్వరాల నడుమ పూజలు ప్రారంభమయ్యాయి. శ్రావణలక్ష్మి పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.400 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు.

